క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు ఆకుల వీర్రాజు పరామర్శ

కడియం: మండలంలోని పలువురిని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు సోమవారం పరామర్శించారు. మాతృవియోగంతో బాధపడుతున్న సీనియర్ జర్నలిస్టు బెజవాడ శంకర్రావు, కుటుంబ సభ్యులను వీరవరంలో పరామర్శించారు. దుళ్లలో మాతృవియోగం పొందిన వైఎస్సార్ సీపీ నాయకులు మద్దిరెడ్డి వెంకన్న, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం తెలిపారు. మురమండ గ్రామానికి చెందిన గణేష్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు బహుమతులు



వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులు

కంబాలచెరువు: పాఠశాల స్థాయి నుండే విద్యార్థులకు శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తిని పెంచాలని డీఎంహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎన్. రాజా ప్రశాంత్ అన్నారు. ఆ పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ శాస్త్రజ్ఞుల సేవలు దేశ పురోభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయన్నారు. ఇటీవల చంద్రయాన్ 3 ప్రయోగం విజయవంతమైన సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వాటిని ఉపాధ్యాయుడు ఎల్.ప్రభాకరరావు సమకూర్చారు. జూనియర్ విభాగంలో ముగ్గురు, సీనియర్ విభాగంలో ముగ్గురిని బహుమతులు ప్రదానం చేశారు.

2,3 తేదీల్లో మంగళగిరిలో జాబ్‌మేళా

సీటీఆర్ఐ: భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2, 3 తేదీల్లో మంగళగిరిలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నారని ఆ పార్టీ నాయకుడు అత్తిలి రాజు అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. పదో తరగతి, డిగ్రీ, పీజీ చదివిన 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. సుమారు 500 కంపెనీల ద్వారా 50 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేస్తారన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై పోరాటం చేయాలి

ప్రకాశం నగర్: అధిక విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక శ్యామల సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో విద్యుత్ అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రపంచ బ్యాంకు సంస్కరణలు అమలు చేసి, విద్యుత్ రంగాన్ని మూడు ముక్కలు చేసిందన్నారు. సంస్కరణలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు పెద్ద ఎత్తున విద్యుత్ పోరాటాన్ని కొనసాగించాయని గుర్తు చేశారు. ఆ సమయంలో బషీర్‌బాగ్ ప్రాంతంలో పోలీసులు కాల్పులు జరపడంతో బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధనరెడ్డి అనే ముగ్గురు కార్యకర్తలు అమరులయ్యారన్నారు. నగర కార్యదర్శి బి.పవన్, బి.రాజులోవ, ఎస్. మూర్తి, తులసి, పి.వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల నిరసన

ధవళేశ్వరం: గ్రామంలోని గాయత్రి ఇసుక ర్యాంపు వద్ద సోమవారం టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక మాఫియా ఆగడాలు పెరిగిపోయాయని విమర్శించారు. అనంతరం ర్యాలీగా లాలాచెరువులోని ఇసుక స్టోరేజ్‌కు తరలివెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	బెదురులంక 2012
సూర్యమినీ	డ్రీమ్‌గర్ల్-2
సూర్యప్యాలెస్	గాండీవధారిఅర్జున
స్వామి	భోళాశంకర్
శివజ్యోతి	బెదురులంక 2012
అనుశ్రీ	కింగ్ ఆఫ్ కొత్త
రాజా	గాండీవధారి అర్జున
అశోక	జైలర్
ఊర్వశి	గాండీవధారి అర్జున
రంభ	బేబి
మేనక	ఏం చేస్తున్నావని, భూతాల బంగళా
అప్సర	బాయ్స్‌హాస్టల్
నామవరం	
వీఎస్ మహల్	గాండీవధారి అర్జున
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	గాండీవధారి అర్జున
కడియం	
వెంకటసూర్య	గాండీవధారి అర్జున

ఉద్యానవనం.. కళావిహీనం

- అధ్వానంగా కాటన్ బ్యారేజీ దిగువ పార్కులు
- పెరిగిపోయిన పిచ్చిమొక్కలు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు



బ్యారేజీ దిగువన కాటన్ గెస్ట్ హౌస్ పక్కన మొక్కలు, పొదలతో ఉన్న పార్కు



పార్కు లోపల పెరిగిన పిచ్చి మొక్కలు



అలంకార ప్రాయంగా ఫౌంటైన్

ధవళేశ్వరం: ఇరిగేషన్ యంత్రాంగం నిర్లక్ష్యంతో కాటన్ బ్యారేజీ దిగువన ఉన్న పార్కులు కళావిహీనంగా మారాయి. వీటి నిర్వహణ పట్టించుకోకపోవడంతో చిట్టడవిని తలపించేలా తయారయ్యాయి. గోదావరి అందాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ఈ పార్కుల్లో సేద తీరుతుంటారు. అదే విధంగా ప్రతి రోజూ వందల మంది స్థానికులు ఉదయం పూట ఈ పార్కుల్లోకి వాకింగ్‌కు వస్తుంటారు. ఆదివారం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధికంగా సందర్శకులు తరలి వస్తారు. అయితే పార్కుల్లో కనీస నిర్వహణ లేకపోవడంతో సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో బ్యారేజీ దిగువ ఉన్న మొదటి పార్కు నిర్వహణను జీవీకే సంస్థ నిర్వహించేది. ప్రస్తుతం వారు వదిలేయడంతో ఇరిగేషన్ అధికారులు తూతూమంత్రంగా నిర్వహణ పనులను చేపడుతున్నారు.

చిట్టడవిని తలపించేలా..

కాటన్ బ్యారేజీ దిగువన కాటన్ గెస్ట్‌హౌస్ పక్కనే ఉన్న పార్కు చిట్టడవిని తలపిస్తోంది. పొదలు, మొక్కలు పెరిగిపోయి అధ్వానంగా తయారైంది. దీనిలోకి వెళ్లాలంటే సందర్శకులు భయాందోళన చెందుతున్నారు. పాములు సైతం యథేచ్ఛగా తిరుగుతుండటంతో ఈ పార్కుల్లోకి వచ్చే సందర్శకులు క్రమేపీ తగ్గిపోయారు. అయినప్పటికీ ఇరిగేషన్ అధికారులు సమస్యపై దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

దృష్టి సారించక..

బ్యారేజీకి సంబంధించి అదనంగా ఉన్న సిబ్బందిని పార్కుల నిర్వహణకు కేటాయించే అవకాశం ఉన్నా ఇరిగేషన్ అధికారులు దృష్టి సారించడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదే విధంగా స్థానికంగా ఉన్న పెద్ద పరిశ్రమలకు పార్కుల నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తే బాగుంటుందని సూచిస్తున్నారు. గతంలో బ్యారేజీ దిగువ ఉన్న మొదటి పార్కును ప్రైవేట్ సంస్థ నిర్వహించేది. ప్రస్తుతం ఒక్కోసారి వాకర్సే పార్కును శుభ్రం చేసుకుంటున్నారు. పార్కులో ఉన్న వాటర్ ఫౌంటైన్ అలంకార ప్రాయంగా మారింది. ఇరిగేషన్ యంత్రాంగం అశ్రద్ధతో ఈ రెండు పార్కులు పూర్తి కళావిహీనంగా మారాయి. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని కాటన్ బ్యారేజీ దిగువ ఉన్న పార్కులను పూర్తి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

గర్భిణులకు ఇబ్బంది లేకుండా వైద్యసేవలు



వైద్యాధికారులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే గర్భిణులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు సమయాన్ని కేటాయిస్తూ, అదేరోజు వారికి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి సూచించారు. బొమ్మూరులోని డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. జిల్లాలో అమలవుతున్న వైద్య, ఆరోగ్య శాఖ కార్యక్రమాలపై ఆరా తీశారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతినెలా తొమ్మిదో తేదీన గర్భిణులకు పీహెచ్‌సీల్లో ఆరోగ్య పరీక్షల సమయాలను ముందుగానే తెలియజేయాలన్నారు. లెప్రసీ, క్షయనివారణాధికారి డాక్టర్ ఎస్. వసుంధర పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో అమలవుతున్న అన్ని కార్యక్రమాలను వివరించారు. డాక్టర్లు రాజీవ్, అభిషేక్ రెడ్డి, ఎపిడమాలజిస్ట్ సుధీర్, జిల్లా మలేరియా అధికారి వీర్రాజు, శ్రీవల్లి, జిల్లా ఇమ్యూనికేషన్ అధికారి రాజకుమారి, లావణ్య, డిప్యూటీ డెమో సత్యకుమార్, రవికుమార్ తదితరులు శాఖల పరంగా అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఎస్‌హెచ్ఎం డీపీఓ సంధ్యారెడ్డి, సీహెచ్ఓ వెంకటరత్నం, డీపీహెచ్ ఎన్ఓ వసంత కుమారి పాల్గొన్నారు.

111 మంది తెలుగు కవుల ఫొటోల అందజేత



ఉపాధ్యాయుడు సత్యనారాయణ అందజేసిన తెలుగు రచయితల చిత్రపటాలతో స్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు

కడియం: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ రూ.3,500 విలువైన 111 మంది తెలుగు కవులు, కవయిత్రిలు, రచయితల ఫొటోలను స్కూలుకు అందజేశారు. వీటిని స్కూలు గ్రంథాలయంలో ఉంచి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వినియోగిస్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్ఎం టి.సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు భాషకు విశేష సేవలందించిన ఈ ప్రముఖుల జీవిత విశేషాలు విద్యార్థులకు స్ఫూర్తినిస్తాయన్నారు. వారిపై అవగాహన పెంచుకోవడానికి, తద్వారా భాషపై ఇష్టాన్ని కలిగించడానికి తోడ్పడతాయన్నారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు సత్యనారాయణను అభినందించారు. శరత్‌బాబు, పెర్సీ, గిరిజ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమానికి నిరంతర కృషి

- సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్
- లింగంపేటలో గడప గడపకూ..



ప్రజలకు అభివాదం చేస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 39వ డివిజన్ లింగంపేటలో వార్డు ఇన్‌చార్జి బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ లంక ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలపై ఆరా తీశారు. 2024లో జరగనున్న ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు పాల్గొన్నారు.

మౌలిక సమస్యలను పరిష్కరించాలి

నగరంలో వివిధ డివిజన్లలో మౌలిక సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్‌కు వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, డివిజన్ ఇన్‌చార్జులు, క్లస్టర్ ఇన్‌చార్జులు ఉన్నారు.


రోడ్డుపై గ్రావెల్‌తో రాకపోకలకు ఇబ్బందులు



గ్రావెల్‌లో కూరుకుపోయిన స్కూలు బస్సును బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న స్థానికులు

కడియం: మండలంలోని వేమగిరిలో ప్రైవేటు వ్యక్తుల నిర్లక్ష్యం కారణంగా స్కూలు విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని దేవీ జనార్దన్ నగర్‌లో కోకాకోలా ఫ్యాక్టరీ వెనుక వైపు తమ వ్యక్తిగత పనుల కోసం తీసుకువచ్చిన గ్రావెల్‌ను రోడ్డుపై వేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అది మొత్తం నానిపోయి, రోడ్డు మీద వెళ్లే వారికి పరీక్ష పెడుతోంది. ముఖ్యంగా స్కూలు విద్యార్థులను తీసుకువెళ్లే బస్సులు ఈ గ్రావెల్‌లో కూరుకుపోయి నిలిచిపోతున్నాయి. శని, సోమవారాల్లో మొత్తం మూడు బస్సులు ఈ విధంగా నిలిచిపోవడంతో ఆ విద్యార్థులు స్కూళ్లకు వెళ్లలేకపోయారని కాలనీ వాసులు వివరిస్తున్నారు. స్థానికులతో కలిసి శ్రమించినప్పటికీ బస్సులను ఈ బురదలోంచి బయటకు తీసేందుకు ఐదారు గంటల సమయం పట్టిందంటున్నారు. సంబంధిత వ్యక్తులకు ఈ మట్టిని తొలగించాలని చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి, చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రత్యేక అలంకరణ



మహా కాళేశ్వరాలయంలో స్వామివారు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గోదావరి తీరంలోని మహా కాళేశ్వరాలయంలో స్వామివారిని సోమవారం త్రయోదశి పర్వదినం సందర్భంగా ఊర్ధ్వముఖ (వెండితో తయారు చేసిన) అలంకరణ చేశారు. ఆ మహాశివలింగ స్వరూపాన్ని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

కడియం: విద్యుత్ వినియోగదారులు తమ సర్వీసుకు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఈఈ డి.శ్రీధర్ వర్మ తెలిపారు. గ్రామాల్లోని విద్యుత్ శాఖ సిబ్బంది వద్ద గానీ, కరెంటు ఆఫీసు, బిల్లు కలెక్టర్, ఈస్టర్న్ పవర్ యాప్, ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్‌లో అనుసంధానం చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. కడియం మండలంలో 22 వేల విద్యుత్ కనెక్షన్లకు గాను 30 శాతం వరకూ మాత్రమే ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసుకున్నారన్నారు. మిగిలిన వినియోగదారులు కూడా సహకరించాలని కోరారు.

దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

సీటీఆర్ఐ: రంగంపేట మండల కేంద్రంలో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ దాసి లావణ్యపై దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు మట్టాడి వెంకటరమణ మాట్లాడారు. రంగంపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరుగుతున్న సర్వసభ్య సమావేశానికి డాక్టర్ లావణ్య హాజరయ్యారన్నారు. ఆ సమయంలో స్థానిక పీహెచ్‌సీ నుంచి స్టాఫ్ నర్సు శశికళ ఫోన్ చేసి కోటపాడు గ్రామానికి చెందిన సరుగూరి అబ్బులు పాముకాటుకు గురయ్యారని, వైద్యసేవలు అందించాలని ఫోన్ చేశారన్నారు. దీంతో డాక్టర్ లావణ్య సమావేశం నుంచి వెళుతుండగా అడ్డుకున్నారన్నారన్నారు.

దుప్పట్ల పంపిణీ

ప్రకాశం నగర్: భారత్ వికాస్ పరిషత్ గోదావరి శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గౌతమీ జీవ కారుణ్య సంఘంలోని పిల్లలకు, వృద్ధులకు సంస్థ అధ్యక్షురాలు కె.జయప్రద, ప్రభాకరరావు చేతుల మీదుగా స్వీట్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. సంఘ చైర్మన్ కొండబాబు, పురుషోత్తమ శాస్త్రి, కె.వీర్రాజు, వి.కృష్ణారావు పాల్గొన్నారు.

31న జిల్లాస్థాయి ఎంపికలు

ప్రకాశం నగర్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో ఈనెల 31న రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడల జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ముఖ్య క్రీడాశిక్షకుడు డీఎంఎం శేషగిరి సోమవారం ప్రకటనలో తెలిపారు. పురుషుల, మహిళల విభాగంలో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, క్యారమ్స్, చదరంగం, క్రికెట్, పుట్‌బాల్, హాకీ, కబ్బడీ, లాన్ టెన్నిస్, స్విమ్మింగ్, ఖోఖో, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, యోగా, రెజ్లింగ్ వంటి పోటీల్లో ఎంపికలు జరుగుతాయన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌పై సమావేశం

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సోమవారం పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, గవర్నమెంట్ ప్లీడర్లు, ప్యానల్ అడ్వకేట్లు, ఇన్సూరెన్స్ సంస్థల అడ్వకేట్లతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డీఎల్ఎస్ఏ చైర్మన్ గంధం సునీత సమావేశం నిర్వహించారు. వచ్చేనెల 9వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి యోగ్యమైన అన్ని రకాల సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసులను భారీ సంఖ్యలో పరిష్కరించడానికి పలు సూచనలు చేశారు. దీనికి అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి, తదితరులు పాల్గొన్నారు.

సిటీ ప్లానర్‌గా మూర్తి

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ సిటీ ప్లానర్‌గా జీవీఎస్ఎన్ మూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరం రీజినల్ జాయింట్ డైరెక్టర్ టౌన్ ప్లానింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఆయనను సిటీ ప్లానర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకూ ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్‌గా ఉన్న చంద్రబోస్.. డిప్యూటీ సిటీ ప్లానర్‌గా విధులు నిర్వహించనున్నారు.

సంతకాల సేకరణ

రాజమహేంద్రవరం సిటీ: మన దేవాలయం – మన హక్కు నినాదంతో బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆ పార్టీ నాయకులు నగరంలోని పలు ఆలయాల వద్ద సోమవారం భక్తుల నుంచి సంతకాల సేకరించారు. ఈ సందర్భంగా జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు మాట్లాడుతూ హిందూ దేవాలయ పాలక మండలిలో అన్యమతస్తుల నియామకం తగదన్నారు. జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, నాయకులు పొట్లూరి రామ్మోహనరావు, ఓబీసీ జోనల్ ఇన్‌చార్జి కురగంటి సతీష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



రాజమహేంద్రవరం సిటీ: హైదరాబాద్ – షాలీమార్ (18046) ఎక్స్‌ప్రెస్ నుంచి జారిపడి గాయాలపాలైన వ్యక్తి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని రాజమహేంద్రవరం జీఆర్పీ ఎస్సై లోవరాజు సోమవారం తెలిపారు. ఆదివారం సాయంత్రం రైలు నుంచి జారిపడిన అతడిని 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. ఆ సమయంలో అతడిని విచారించగా, తన పేరు అయ్యప్పస్వామి, జెడ్.రాగంపేట గ్రామానికి చెందిన వాడినని చెప్పాడన్నారు. మృతదేహన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు. అతడి ఆచూకీ తెలిసిన వారు 0883 2442821, 94914 44022, 94406 27551 నంబర్లను సంప్రదించాలన్నారు.

వక్ఫ్‌బోర్డు అధికారిపై అసత్య ప్రచారం తగదు



మహ్మద్ ఆరీఫ్

ప్రకాశం నగర్: ఆంధ్ర ప్రదేశ్ వక్ఫ్‌బోర్డ్ ప్రత్యేక అధికారి, ఐపీఎస్ ఆఫీసర్ షీరీన్ బేగంపై కొందరు టీడీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేసి, ఇబ్బందులకు గురి చేయడం దారుణమని వక్ఫ్‌బోర్డ్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఆరీఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జాంపేటలోని తన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. మైనారిటీ హక్కుల సంఘం పేరుతో మైనారిటీ మహిళ గౌరవ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. వక్ఫ్ బోర్డ్ ఆస్తుల పరిరక్షణ కోసం నిజాయితీగా కృషి చేస్తున్న షీరీన్ బేగంపై, అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న టీడీపీ ఏజెంట్ ఫారూఖ్ షుబ్లి అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. గత ప్రభుత్వం వక్ఫ్ బోర్డును అవినీతిమయం చేసి, వేల ఎకరాల భూములను అన్యాక్రాంతమయ్యేలా చేసి మైనారిటీలకు తీవ్రమైన ద్రోహం చేసిందన్నారు. అటువంటి సమయంలో ఫారూఖ్ షుబ్లి ఎక్కడ దాక్కున్నాడని ప్రశ్నించారు. ముస్లింల ఆస్తుల పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో నిజాయితీగా పనిచేస్తున్న ముస్లిం అధికారులపై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ పైపులైన్ లీకేజీ, రోడ్డు స్థలం ఆక్రమణ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీరు తదితర సమస్యలపై 19 వినతులు స్వీకరించామన్నారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ వైబీఆర్ చంద్రబోస్, డిప్యూటీ కమిషనర్ కె.సాంబశివరావు, సూపరెంటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు పాల్గొన్నారు.

స్పందనకు మూడు అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి మూడు అర్జీలు వచ్చాయని ఎంపీడీవో డి.శ్రీనివాసరావు తెలిపారు. హుకుంపేట సావిత్రీ నగర్ సమీపంలోని చైతన్య వీధిలో ముంపు సమస్య, అడంగల్ కరెక్షన్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం ప్రజలు అర్జీలు అందజేశారన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోదావరి తీరం కలిసొచ్చిన ప్రాంతం



శివజ్యోతి థియేటర్‌లో ప్రేక్షకులతో మాట్లాడుతున్న హీరో కార్తికేయ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): 'నా తొలిచిత్రం ఆర్ఎక్స్ 100 రాజమహేంద్రవరంలోని శివజ్యోతి థియేటర్‌లో 100 రోజులు ఆడింది. గోదావరి తీరం నాకు కలసి వచ్చిన ప్రాంతం' అని సినీ హీరో కార్తికేయ అన్నారు. ఆయన హీరోగా నటించి బెదురులంక 2012 సినిమా విజయవంతమైన నేపథ్యంలో విజయ యాత్రలో భాగంగా సోమవారం రాత్రి ఫస్ట్‌షో సమయానికి శివజ్యోతి థియేటర్‌కు వచ్చారు. అభిమానులతో ఆనందాన్ని పంచుకున్నారు. బెదురులంక సినిమాకు విజయాన్ని అందించిన ప్రేక్షకులకు రుణపడి ఉంటానన్నారు.

బైక్‌ల చోరీ కేసులో ఇద్దరికి జైలు

రాజమహేంద్రవరం రూరల్: బైక్‌ల చోరీ కేసులో రాజమహేంద్రవరానికి చెందిన గుదే పవన్ కుమార్, యర్రవరపు సత్యనారాయణకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ సోమవారం ఆరో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎన్.రెడ్డి ప్రసన్న తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. బొమ్మూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆవరోడ్ ఏకలవ్య చిల్డ్రన్స్‌హోమ్, దివాన్ చెరువు, రహమత్ నగర్, బొమ్మూరు, లాలాచెరువు పరిసర ప్రాంతాలలో ఐదు బైక్‌లు చోరీకి గురయ్యాయని కేసులు నమోదయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాయుడు విజయకుమార్ ఈ ఏడాది జూన్ 27న గుదే పవన్‌కుమార్, యర్రవరపు సత్యనారాయణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి, ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. త్వరితగతిన విచారణ చేపట్టి చార్జ్‌షీట్ ఫైల్ చేయగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీవిద్య సాక్షులను విచారణ చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితులకు న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



కారు ఢీకొని మృతి చెందిన శ్యామ్‌సన్

కంబాలచెరువు: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన రాజమహేంద్రవరం లాలాచెరువు ప్రాంతంలో చోటు చేసుకుంది. దీనిపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. కొంతమూరుకు చెందిన అల్లాడి శ్యామ్‌సన్ (28) కోటిపల్లి బస్టాండ్ వద్ద ఉన్న టీవీఎస్ షోరూమ్‌లో పనిచేస్తుంటాడు. ఆదివారం రాత్రి స్నేహితుడి ఇంటికి వెళ్లి అర్ధరాత్రి తిరిగి కొంతమూరు ఇంటికి బయల్దేరాడు. సరిగ్గా లాలాచెరువు నుంచి క్వారీకి వెళ్లే లాలాచెరువు జంక్షన్ వద్దకు వచ్చే సరికి అతివేగంగా కారు వచ్చి శ్యామ్‌సన్ మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో అతడు తీవ్రగాయాలతో రోడ్డుపై పడి మృతి చెందాడు. అదే సమయానికి తన కుమారుడు ఇంకా ఇంటికి రాలేదని తండ్రి ఫోన్ చేశారు. సంఘటన స్థలంలో ఉన్న కొందరు ఆ ఫోన్‌ను ఎత్తి జరిగిన విషయం చెప్పారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యావేత్త శారదారావు మృతి



రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని జీఎస్‌కేఎం కళాశాల, విమెన్ కమిటీ వ్యవస్థాపకురాలు వి.శారదారావు (101) సోమవారం రాజమహేంద్రవరంలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆమె గుంటూరు డీఈవోగా, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌గా సేవలందించారు. 1983లో తన అన్నయ్య జీఎస్‌కృష్ణ పేరు మీద జీఎస్‌కేఎం లా కళాశాల స్థాపించారు. 1996లో శారద డిగ్రీ, పీజీ కళాశాల, 2007లో శారద బీఈడీ కళాశాల, 2012లో శారద డీఎడ్ కళాశాలను ఏర్పాటుచేశారు. విద్యారంగంలో సేవలకు గాను మాజీ గవర్నర్ నారాయణసింగ్ చేతుల మీదుగా గౌరవ పురస్కారం అందుకున్నారు. రాజమహేంద్రవరం కేంద్రంగా స్త్రీ సంక్షేమ సంఘాన్ని స్థాపించి మహిళల కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించారు. రచయితగా అనేక నవలలు రాశారు. శారదారావు మృతికి ఎంపీ మార్గాని భరత్ రామ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి భవాని, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాష్, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్ కుమార్, హర్షకుమార్ సంతాపం తెలిపారు.